క్లుప్తంగా

కోట్లమ్మను దర్శించిన వాసుబాబు



వాసుబాబును సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

ఉంగుటూరు: చేబ్రోలు గ్రామ దేవత కోట్లమ్మ ఆలయ 72వ ఉత్సవాల సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు గురువారం అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వాసుబాబుకు శాలువా కప్పి జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి., మాజీ సర్పంచ్ కరణం బుజ్జి, ఎంపీటీసీ మనసాల నాగమణి, రాయి లక్ష్మి, పుప్పాల గోపి తదితరులు పాల్గొన్నారు.

గుండేరు వాగుకు గండి



దెందులూరు సైఫన్ వద్ద గండి కొట్టిన దృశ్యం

దెందులూరు: గత మూడు రోజులుగా గుండేరు వాగు ఉధృతి విపరీతంగా పెరగడంతో దెందులూరు సైఫన్ వద్ద గండికొట్టారు. గతంలో దెందులూరు- అలుగులగూడెం వెళ్లే మార్గంలో గుండేరువాగు ఉధృతికి ఒక మహిళ మృతి చెంది, మరో చిన్నారి కొట్టుకుపోయిన నేపథ్యంలో ఎటువంటి ప్రమాదం జరగకుండా ముందస్తు జాగ్రత్తగా గండి కొట్టారు. దీంతో గుండేరువాగు నీరుసీతంపేట కాల్వ ద్వారా దిగువ ప్రాంతానికి సరఫరా అవ్వడమే కాకుండా సైఫన్ వద్ద రాకపోకలకు ఇబ్బంది లేకుండా ప్రయాణికులకు ప్రమాదం తప్పింది. భవిష్యత్తులో సైఫన్ పక్కన రెండు వైపులా పటిష్టమైన కంచె ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యార్థుల ర్యాలీ



విద్యార్థులు ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

దెందులూరు: కోల్‌కతాలో వైద్య విద్యార్థిని హత్యాచారం సంఘటనను నిరసిస్తూ గురువారం సెయింట్ మేరిస్ పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ప్రిన్సిపాల్ సిస్టర్ టీనా ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు వైద్యశాల సెంటర్, హైస్కూల్, కృష్ణా కెనాల్, పెదదళితపేటలో ర్యాలీ నిర్వహించారు. సేవ్ డెమోక్రసీ- దోషులను కఠినంగా శిక్షించాలంటూ నినాదాలు చేశారు.

అయ్యన్న మరణం తీరని లోటు



అయ్యన్నకు నివాళులర్పిస్తున్న బలరామ్

గణపవరం: అర్ధవరం మాజీ సర్పంచ్, కమ్యూనిస్టు నేత చిన్న అయ్యన్న మరణం తీరనిలోటని సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరామ్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి క్రాంతిబాబు అన్నారు. గురువారం గణపవరం మండలం అర్ధవరంలో మాజీ సర్పంచ్ అయ్యన్న భౌతికకాయాన్ని సందర్శించి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో పి.నర్సింహమూర్తి, కేవీపీఎస్ మండల కార్యదర్శి చిన్నంచిన నాగేశ్వరరావు, సీఐటీయూ నాయకులు ఎం.ఆంజనేయులు, సీపీఎం నాయకులు జక్కంశెట్టి సత్యనారాయణ, గణపవరం ఎంపీపీ అర్ధవరం రాము సంతాపం తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం



ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

పెదవేగి : మోండలీజ్ కంపెనీ సహకారంతో ఆఫ్రో సంస్థ విజయరాయి గ్రామంలో గుడ్ సమారిటన్ కేన్సర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ క్యాంప్‌లో విజయరాయి గ్రామ ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. డాక్టర్ జాకబ్, పీఆర్వో వినీల్, ఆఫ్రో సంస్థ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ నాగరాజు, ఏరియా ఫీల్డ్ ట్రైనర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

జంగారెడ్డిగూడెం: రెండు వేర్వేరు ఘటనల్లో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌లను సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. ఇసుక అక్రమ రవాణాపై అందిన సమాచారం మేరకు మండలంలోని మైసన్నగూడెం గ్రామశివారులో పోలీసులు తనిఖీలు చేశారు. అనుమతి పత్రాలు లేకుండా రెండు ట్రాక్టర్‌లలో జల్లేరు వాగు నుంచి ఇసుక తరలిస్తుండగా, ట్రాక్టర్‌లను పట్టుకుని సీజ్ చేసి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ సీహెచ్ కోటేశ్వరరావు చెప్పారు. అలాగే మండలంలోని పంగిడిగూడెం శివారు జల్లేరు వాగునుంచి ఇసుకను తరలిస్తున్న మరో రెండు ట్రాక్టర్‌లను సీజ్ చేసి ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ ఎస్.ఉమామహేశ్వరరావు తెలిపారు.

ఈ పంట నమోదును వేగవంతం చేయాలి



అంబర్‌పేటలో ఈ క్రాప్ నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా

భీమడోలు: ఈ పంట నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా అన్నారు. మండలంలోని భీమడోలు, అంబర్‌పేట గ్రామాల్లో ఈ క్రాప్ నమోదు కార్యక్రమాన్ని ఆయన గురువారం పరిశీలించారు. క్షేత్ర స్థాయిలో ఈ క్రాప్ సక్రమంగా నమోదు చేస్తున్నదీ లేనిదీ ఆయన పరిశీలించారు. రైతుల నుంచి సేకరిస్తున్న వివరాలు యాప్‌లో సక్రమంగా నమోదు చేయాలని, తప్పులు దొర్లితే పంట విక్రయించుకునేందుకు రైతులు ఇబ్బందులు పడు అవకాశముందని అన్నారు. మండల వ్యాప్తంగా 12964 ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు చేస్తుండగా ఇప్పటి వరకు 4,816.24 ఎకరాల్లోని పంట వివరాలను ఈ క్రాప్‌లో నమోదు చేయడం జరిగిందని ఏవో ఎస్‌పీవీ ఉషారాణి డీఏవోకు తెలిపారు. ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని, త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ డాక్టర్ పి.ఉషారాజకుమారి, వ్యవసాయ గ్రామ సహాయకులు పాల్గొన్నారు.

ఉంగుటూరు: రైతులు, కౌలు రైతులు ప్రతి ఒక్కరూ ఈ పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి హబీబ్ బాషా కోరారు. గురువారం ఉంగుటూరు మండలం కైకరం, నారాయణపురం, తల్లాపురం గ్రామాలలో ఈ పంట నమోదును ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో భీమడోలు ఏడీఏ పి.ఉషారాజకుమారి, మండల వ్యవసాయ అధికారి సీహెచ్ రవికుమార్, గ్రామ వ్యవసాయ సహాయకలు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు పరిశీలన

దెందులూరు: పంటల బీమాకు, ధాన్యం కొనుగోలుకు ఈ- పంట ప్రధాన ఆధారమని జిల్లా వ్యవసాయాధికారి డాక్టర్ హబీబ్ బాషా అన్నారు. గురువారం దెందులూరు మండలంలో కొవ్వలి, సీతంపేట గ్రామాల్లో ఈ- పంట నమోదు ప్రక్రియను మండల ఏఓ గద్దె రమేష్‌తో కలిసి పరిశీలించారు. కొవ్వలిలో రైతు, పొలం, పంటసాగు వివరాలను జిల్లా వ్యవసాయ శాఖాధికారి హబీబ్ బాషా స్వయంగా ఆన్‌లైన్ విధానంలో చిత్రీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగుచేసే ప్రతి రైతుకు పంటకు భద్రత, రక్షణ కల్పించేందుకు ఈ-పంట నమోదు అమలు జరుగుతుందన్నారు. రైతులంతా పొలాలకు వ్యవసాయ శాఖ అధికారులు వచ్చినప్పుడు సహాయసహకారాలు అందించాలని కోరారు. కొవ్వలి, సీతంపేటల్లో వ్యవసాయ శాఖ, హార్టికల్చర్ అధికారులు రామకృష్ణ, నాగేంద్ర, రమేష్ ఉన్నారు.

గుడివాకలంకలో ఉప సర్పంచ్ అభ్యర్థి ఎన్నిక

ఏలూరు రూరల్: గుడివాకలంక పంచాయతీ ఉపసర్పంచ్ అభ్యర్థిని గురువారం ఎన్నుకున్నారు. 6వ వార్డు సభ్యురాలు నేపాల కాత్యాయని ఉపసర్పంచ్‌గా ఎన్నుకోవాలని గ్రామ పెద్దలు నిర్ణయించారు. కొద్దిరోజుల క్రితం టీడీపీ నేతల ఒత్తిడి మేరకు వైఎస్సార్ సీపీ సానుభూతిపరులు గ్రామ సర్పంచ్ జయమంగళ ప్రభావతి, ఉపసర్పంచ్ రుక్మనంధమహరాజ్ తమ పదవులకు రాజీనామ చేశారు. ఉపసర్పంచ్ స్థానంలో గ్రామ టీడీపీ నాయకుడు నేపాల జగతిబాబు భార్యను ఇప్పుడు ఎన్నుకున్నారు. త్వరలో నిర్వహించే అధికారిక ఎన్నికలో కాత్యాయనిని గెలిపించాలని ఇతర వార్డు సభ్యులకు సూచించారు.

వైభవంగా కోట్లమ్మ ఉత్సవాలు

ఉంగుటూరు: చేబ్రోలు గ్రామదేవత కోట్లమ్మ ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఈనెల 25 వతేదీ వరకు ఉత్సవాలు జరగుతాయని ఉత్సవ కమిటీ సభ్యులు కరణం బుజ్జి తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా గురువారం రాత్రి కూచిపూడి జానపద నృత్యం ప్రదర్శించారు.

● వైఎస్ జగన్‌ను కలిసిన నేతలు





వైఎస్ జగన్‌ను కలిసిన దెందులూరు, ఉంగుటూరు నియోజకవర్గ సమన్వయకర్తలు కొఠారు అబ్బయ్యచౌదరి, పుప్పాల వాసుబాబు, జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ దంపతులు

వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గురువారం దెందులూరు, ఉంగుటూరు నియోజకవర్గ నేతలు గురువారం తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పార్టీ అధినేతకు నియోజకవర్గాల్లోని పరిస్థితులను వివరించారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ మాట్లాడుతూ కార్యకర్తలకు అండగా ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, అలాగే ప్రజల సమస్యలపై పోరాడాలని సూచించినట్లు నేతలు తెలిపారు. - సాక్షి, నెట్‌వర్క్

నిమ్మలో గడ్డి తెగులు.. ఆందోళనలో రైతులు



పెదవేగిలో గడ్డి తెగులు ఆశించిన నిమ్మ చెట్లు

దెందులూరు: దెందులూరు నియోజకవర్గంలోని నిమ్మ తోటల్లో గడ్డి తెగులు ఆశించడంతో నిమ్మ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెదవేగి, దెందులూరు మండలాల్లో 1582 ఎకరాల్లో నిమ్మ సాగు జరుగుతోంది. కనివిని ఎరుగని రీతిలో గడ్డి తెగులు ఆశించి చెట్లు పూర్తిగా ఎండిపోవడం, కాసిన కాయ నేలబారిన పడిపోవడం, కొన్ని చెట్లల్లో అసలు కాయలు కాయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దెందులూరు నియోజకవర్గం పూర్తి వ్యవసాయ ఆధారిత ప్రాంతం. అంతర పంటల్లో అద్భుతాలు సృష్టించి ఇతర జిల్లాల రైతాంగానికి ఆదర్శంగా నిలిచిన ఈ ప్రాంత రైతులు నిమ్మసాగులో ఎదురైన ఇబ్బందులతో సతమతమవుతున్నారు. గత ప్రభుత్వం రైతుభరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చేలా చర్యలు తీసుకుందని రైతులు తెలిపారు. ప్రస్తుతం ఇంతటి స్థాయిలో నిమ్మ చెట్లు గడ్డి తెగులుతో పూర్తిగా పాడవుతుంటే హార్టికల్చర్ అధికారులు కనీసం పొలాలకు వచ్చి చూసింది లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. హార్టికల్చర్ అధికారులు, పెదవేగి, దెందులూరు మండలాల్లో నిమ్మ తోటలను పరిశీలించి రైతులకు అవగాహన సమావేశాలు నిర్వహించాలని కోరుతున్నారు. కాగా ఈ తెగులు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై హార్టికల్చర్ అసిస్టెంట్ వివరించారు. గడ్డితెగులు నివారణకు బావిస్టిన్ రెండు గ్రాములు ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. 3-4 రోజులు పాటు రోజుకు నాలుగుసార్లు చొప్పున పిచికారీ చేయాలన్నారు. ఎస్ఈపీటీఏసీఎల్ఐఎల్ఈ ఒక మిల్లీమీటరు ఒక లీటరు నీటిలో కలిపిన మిశ్రమాన్ని రోజుకు రెండుసార్లు 3-4 రోజులు పిచికారీ చేయాలని తెలిపారు. మరిన్ని వివరాలను హార్టికల్చర్ ఉద్యోగులను సంప్రదించాలని, హార్టికల్చర్ సలహాలు, సూచనలు పాటిస్తూ గడ్డి తెగులు నివారణకు కృషి చేయాలన్నారు.

ఇక్కడ సిగ్నల్స్ లేవు.. జాగ్రత్త సుమా..!



గుండుగొలను హైవే రోడ్డుపై డివైడర్ వద్ద సిగ్నల్ ఏర్పాటు చేయని దృశ్యం



సోమవరప్పాడు డివైడర్ వద్ద సిగ్నల్ ఏర్పాటు చేయని దృశ్యం

దెందులూరు: జాతీయ రహదారిపై డివైడర్ల వద్ద ఎన్‌హెచ్ఏ అధికారులు, ఆర్‌అండ్‌బీ అధికారులు సిగ్నల్స్ ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తుండడంతో అనేక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. జాతీయ రహదారిపై విజయవాడ-వైజాగ్ రోడ్డు, ఏలూరు-జంగారెడ్డిగూడెం రోడ్డుపై నిత్యం అనేక వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే గుండుగొలను, సోమవరప్పాడు వద్ద వాహనచోదకులకు స్పష్టంగా మార్గం తెలిసేలా డివైడర్ల వద్ద సిగ్నల్స్ ఏర్పాటు చేయకపోవడంతో తరచుగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ ప్రమాదాల్లో కొందరు మృత్యువాత పడగా మరికొందరు క్షతగాత్రులవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డివైడర్ల వద్ద సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

డిగ్రీ అడ్మిషన్లకు 24 వరకు గడువు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రస్తుతం మొదటి సంవత్సరం అడ్మిషన్లు జరుగుతున్నాయని కళాశాల ప్రిన్సిపాల్ జి.గిరిబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఫేజ్-1లో రిజిస్ట్రేషన్ చేసుకోకపోతే ఈనెల 24వ తేదీ లోగా కళాశాలలో రిజిస్టర్ చేయించుకోవచ్చని, అలానే తక్కువ ఫీజులతో ఉత్తమ విద్యను అందిస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరగోరు విద్యార్థులు ఫేజ్-2లో వెబ్‌ఆప్షన్స్ పెట్టుకోవడానికి తమ కళాశాలలో సంప్రదించవచ్చన్నారు.

నూరుశాతం ఫలితాలు

గురువారం విడుదల అయిన డిగ్రీ నాలుగో సెమిస్టర్ ఫలితాలలో తమ కాలేజీ విద్యార్థులు 70 శాతం ఉత్తీర్ణత సాధించి ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ జి.గిరిబాబు తెలిపారు. హిస్టరీ (1-2), ఎకనామిక్స్ (1-2), పొలిటికల్ సైన్స్ (1-2), బోటనీ (1), జువాలజీ (1) కాస్ట్ అండ్ మేనేజమెంట్ అకౌంటింగ్, ఆడిటింగ్, డేటాబేస్ మేనేజ్‌మెంట్ సబ్జెక్టులలో 100 శాతం ఉత్తీర్ణత సాధించారని వివరించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను, అధ్యాపకులను ప్రిన్సిపాల్ ప్రత్యేకంగా అభినందించారు.

అక్రమ లేఅవుట్ వేస్తే చర్యలు

చింతలపూడి: చింతలపూడి పట్టణంలో అక్రమ లేఅవుట్‌లు వేసి విక్రయించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని నగర పంచాయతీ కమిషనర్ రాజు గురువారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. వినియోగదారులు ఇళ్ల స్థలాలు కొనుగోలు చేసే సమయంలో లేఅవుట్‌కు అనుమతులు ఉన్నాయో లేదో సరిచూసుకుని, ఆ తరువాత మాత్రమే కొనుగోళ్లు చేపట్టాలన్నారు. అనుమతులు లేని లేఅవుట్‌లలో ఇళ్ల స్థలాలు కొనుగోలు చేస్తే, సదరు స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలకు గాని, మంచినీటి కుళాయిల మంజూరుకు గాని నగరపంచాయతీ ఎటువంటి అనుమతులు ఇవ్వడం జరగదని కమిషనర్ పేర్కొన్నారు. ప్రజలు ఇంటి స్థలాల కొనుగోలు విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. అలాగే అక్రమంగా లేఅవుట్ వేసినవారిపై పురపాలక చట్టం 1965 ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

దోమల నివారణతోనే డెంగీ దూరం

ఏలూరు టౌన్: వాతావరణంలో మార్పులతో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయనీ వైద్య సిబ్బంది మరింత అంకితభావంతో పనిచేస్తూ వ్యాధుల నివారణకు కృషి చేయాలని జోన్-2 మలేరియా అసిస్టెంట్ డైరెక్టర్ బీ.లక్ష్మీ నరసింహకుమార్ సూచించారు. నగరంలోని గవరవరం, చొదిమెళ్ళ, తదితర డెంగీ ప్రభావిత ప్రాంతాల్లో ఆయన గురువారం పర్యటించారు. స్థానికంగా పరిస్థితులను ఆయన పరిశీలించి, అక్కడి వైద్య సిబ్బందికి సూచనలు చేశారు. డెంగీ ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉందని, జ్వరం వచ్చిన వెంటనే సమీపంలోని వైద్యుల వద్దకు వెళ్ళి పరీక్షలు చేయించుకోవాలని కోరారు. ప్రజలకు పరిసరాల పరిశుభ్రత, ఇంట్లో వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా చైతన్యవంతులను చేయాలని వైద్య సిబ్బందిని కోరారు. టైర్లు, కొబ్బరి బొండాలు, రుబ్బురోళ్ళు, పూలకుండీల్లో నీటి నిల్వ లేకుండా వారంలో ఒకసారి శుభ్రం చేసుకోవాలని చెప్పారు. డెంగీ దోమలు మంచినీటి నిల్వ ప్రాంతాల్లోనే పెరుగుతుందనీ, ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని, అశ్రద్ధ చేయటం ద్వారా దోమకాటుకు గురైతే డెంగీ వ్యాధి బారిన పడే ప్రమాదం ఉందన్నారు. జిల్లా మలేరియా అధికారి పీఎస్ఎస్ ప్రసాద్, అసిస్టెంట్ మలేరియా అధికారి జే.గోవిందరావు, జోనల్ టీం సభ్యులు రవిశేఖర్, సతీష్ ,నిరంజన్, హెల్త్ సూపర్‌వైజర్ నాగమల్లేశ్వరరావు, కిరణ్, మలేరియా హెల్త్ అసిస్టెంట్ మేక శ్రీనివాసరావు, రమేష్‌బాబు, జోషి, ఆరోగ్య కార్యకర్తలు దుర్గ, శ్యామల, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

కంటి సమస్యలపై నిర్లక్ష్యం తగదు



విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

గణపవరం: విద్యార్థులు కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ఉపాధ్యాయులకు కాని, తల్లిదండ్రులకు కాని తెలిపి వైద్యసిబ్బందిని సంప్రదించాలని గణపవరం పీహెచ్‌సీ ఆప్తాలమిక్ సహాయకుడు శ్రీనివాస్ అన్నారు. జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా గురువారం అర్ధవరం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా 195 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు చేయగా 20 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించారు. వీరికి త్వరలో ఉచితంగా కళ్లజోళ్లు అందజేస్తామని తెలిపారు. పీహెచ్‌సీ సీహెచ్‌వో జాలాది విల్సన్ మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యంగా ఉండటానికి ఆకుపచ్చని ఆకుకూరలు, తాగా పండ్లు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ప్రసన్నాంజనేయులు, ఉపాధ్యాయులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

కూటమి నేతల అత్యుత్సాహం..



చేబ్రోలులో వైఎస్సార్ సీపీ హయాంలో నిర్మించిన శిలాఫలకాన్ని ఫ్లెక్సీతో మూసివేసిన దృశ్యం

ఉంగుటూరు: కూటమి నేతల అత్యుత్సాహం చూసి ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. చేబ్రోలు గ్రామంలో గురువారం ఉర్దూ పాఠశాల అదనపు తగరతి గది ప్రారంభోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు హాజరయ్యారు. అయితే ఆయన స్వాగతం పలికేందుకు కూటమి నేతలు ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. అయితే గత ప్రభుత్వంలో నిర్మించిన మంచి నీటి బోరుకు చెందిన శిలఫలకాన్ని మూసివేసి ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఇది సబబు కాదని, అక్కడ ఫ్లెక్సీ తొలగించాలని ఆ గ్రామ ఎంపీటీసీ మనసాల నాగమణి కోటేశ్వరరావు గ్రామసర్పంచికి, పంచాయితీ సిబ్బందికి, ఈవోకి చెప్పినా పట్టించుకోలేదు. దీంతో గత ప్రభుత్వంలో నిర్మించిన శిలాఫలకం ప్రజలకు కనబడకూడదనే దురుద్దేశ్యంతో ఇలా ప్రవర్తిస్తున్నారని ఎంపీటీసీ నాగమణి కోటేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు.

గ్రామాల అభివృద్ధికి పార్టీలకతీతంగా సహకరించాలి



చేబ్రోలులో ఉర్దూ పాఠశాల అదనపు తరగతి గదిని ప్రారంభించిన ఎమ్మెల్యే ధర్మరాజు

ఉంగుటూరు: గ్రామాల అభివృద్ధికి పార్టీలకతీతంగా ప్రజాప్రతినిధులు సహకరించాలని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు కోరారు. గురువారం ఉంగుటూరు మండలం చేబ్రోలులో రూ.23.74 లక్షలు సర్వశిక్షఅభియాన్ నిధులతో నిర్మించిన ఉర్దూ పాఠశాల అదనపు తరగతి గదిని ఆయన ప్రారంభించారు. అలాగే ఉంగుటూరు హౌసింగు కాలనీలో రక్షిత మంచినీటి పథకం నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చేబ్రోలు ఎంఈవో రవీంద్రబారతి, సర్పంచి రంధే లక్ష్మిసునీత, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, ఎంపీటీసీ రాయిలక్ష్మి, మనసాల నాగమణి, ఉంగుటూరు సర్పంచి బండారు సింధు, ఉపసర్పంచి జగదీష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరికుమార్ రాజు, కూటమి నాయకలు పాల్గొన్నారు.

ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించాలి

నిడమర్రు: విద్యార్థులకు చిన్నతనం నుంచే ఆరోగ్య సమస్యలు, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించాలని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. గురువారం బువ్వనపల్లి ప్రీహైస్కూలులో విద్యార్థులకు నిర్వహించిన ఆరోగ్య పరీక్షలను ఆయన ప్రారంభించారు. తాజా ఆకుకూరలు, పండ్లు, పాలు, గుడ్డు వంటివి ఎక్కువగా తీసుకోవాలని, జంక్ ఫుడ్స్‌కు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులకు వైద్యులు వివిధ రకాల పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందచేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ధర్మరాజుతో పాటు పలువురు నాయకులు బీపీ పరీక్షలు చేయించుకున్నారు.

ఆక్వా రైతులకు విద్యుత్ సబ్సిడీ ఇవ్వాలి



ఆక్వారైతుల అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మత్స్యశాఖ ఏడీ శ్రీనివాసరావు

గణపవరం: కూటమి ప్రభుత్వం ఆక్వారైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, పది ఎకరాలకు మించిన ఆక్వా రైతులకు కూడా విద్యుత్ సబ్సిడీ అందజేయాలని పలువురు ఆక్వా రైతులు డిమాండ్ చేశారు. గురువారం గణపవరంలో మత్స్యశాఖ, ఎంపెడా సంయుక్త ఆధ్వర్యంలో ఆక్వా రైతులకు ఎంపెడా ఎన్‌రోల్‌మెంట్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో మత్స్యశాఖ ఏడీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆక్వాసాగు చేసే రైతులు తప్పనిసరిగా అప్సడా అనుమతులు తీసుకోవాలని, ఇంకా అనుమతులు లేనివారు వెంటనే అనుమతులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపెడా డైరెక్టర్ గోపాలకృష్ణ మాట్లాడుతూ మన జిల్లానుంచి ఎగుమతి అవుతున్న ఆక్వా ఉత్పత్తులను ఎంపెడా వారి వద్ద నమోదు చేసుకోవాలని, ఆక్వా ధరల ఆటుపోట్లను మార్కెట్ పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేసుకుంటా ఆక్వా సాగుచేసుకోవాలని రైతులకు సూచించారు. మత్స్యశాఖ అభివృద్ధి అధికారి ఏడుకొండలు మాట్లాడుతూ రైతులు సీడ్, ఫీడ్ నాణ్యతను ప్రభుత్వ లేబొరేటరీలలో పరీక్షించుకున్న తర్వాతనే వినియోగించుకోవాలని సూచించారు. గణపవరం మత్స్యశాఖ అధికారి శివరామకృష్ణ మాట్లాడుతూ రైతులు ఉత్తమ యాజమాన్య పద్ధతులు అవలంభిస్తే, మంచి ఉత్పత్తులను సాధించవచ్చునన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన పలువురు ఆక్వా రైతులు గుర్తింపు పొందిన ఆక్వా హేచరీల వివరాలను ఎప్పటికప్పుడు రైతులకు తెలిసేలా ఏర్పాట్లు చేయాలని, మార్కెటింగ్ సమస్యలను పరిష్కరించి రైతులకు న్యాయం జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు.

కువైట్ నుంచి స్వదేశానికి క్షేమంగా..



కలెక్టర్ వెట్రిసెల్వికి, అధికారులకు కృతజ్ఞతలు తెలుపుతున్న సంకురమ్మ

ఏలూరు (మెట్రో): బతుకుదెరువు కోసం కువైట్ వెళ్లి అక్కడ అవస్థలు పడుతున్న ఓ మహిళ జిల్లా అధికారులు, నాయకుల చొరవతో సురక్షితంగా స్వదేశానికి చేరుకుంది. వివరాలిలా ఉన్నాయి. బుట్టాయగూడెం మండలం మర్లగూడెంకు చెందిన తాటి సుంకరమ్మ ఉపాధి నిమిత్తం కువైట్ దేశానికి వెళ్లింది. అయితే అక్కడ యజమానులు పెట్టే వేధింపులు తాళలేక తన బాధలను తెలుపుతూ సెల్ఫీ వీడియో తీసి జిల్లాకు చెందిన నాయకులకు పంపించింది. దీనిపై పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, ఎంపీ పుట్టా మహేష్ యాదవ్‌లు జిల్లా అధికారులకు రాతపూర్వకంగా సమాచారాన్ని అందించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ వెట్రిసెల్వి తాటి సుంకరమ్మను స్వదేశానికి రప్పించేందుకు డీఆర్వో పుష్పమణికి, మహిళా శిశుసంక్షేమ శాఖ అధికారులకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. డీఆర్వో పుష్పమణి కువైట్ ఎంబసీ అధికారులతో, అదే విధంగా భారత్ ఎంబసీ అధికారులతో సంప్రదింపులు జరిపి సంకురమ్మను క్షేమంగా స్వదేశానికి రప్పించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌ను సుంకరమ్మ గురువారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. సంకురమ్మ సురక్షితంగా స్వదేశానికి తిరిగి వచ్చేందుకు కృషి చేసిన డీఆర్వో పుష్పమణి, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులను కలెక్టర్ అభినందించారు. స్వదేశానికి తిరిగి వచ్చేందుకు చర్యలు తీసుకున్న అధికారులు, నాయకులకు ఈ సందర్భంగా సంకురమ్మ కృతజ్ఞతలు తెలిపింది. అదేవిధంగా సంకురమ్మ కోరిక మేరకు రేషన్‌కార్డు, ఉండేందుకు గృహనిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెట్రిసెల్వి భరోసా ఇచ్చారు.

స్టాప్ డయేరియాపై అవగాహన ర్యాలీ



33వ డివిజన్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ సిబ్బంది

ఏలూరు (టూటౌన్): స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా స్థానిక 33వ డివిజన్‌లో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మాలతి, మలేరియా సిబ్బంది గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. డివిజన్‌లోని చిట్టివలస పాకలు, రైల్వే ట్రాక్ రోడ్డు, ఉషా పిక్చర్స్ రోడ్డు తదితర ప్రాంతాల్లో దోమల లార్వా నిర్మూలనకు స్ప్రేయింగ్, మురుగు కాలువ కల్వర్టుల కింద ఫాగింగ్, ఖాళీ స్థలాలలో ఉన్న నిలువ నీటిలో ఆయిల్ బాల్స్ వేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పి.సుధారాణి, సురేష్, మలేరియా ఇన్‌స్పెక్టర్ దత్తి వేణుగోపాలస్వామి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎస్.అప్పారావు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిషోర్



ఎస్పీ ప్రతాప శివకిషోర్‌ను కలిసిన పోలవరం డీఎస్పీ వెంకటేశ్వరరావు

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లా పోలవరం పోలీస్ సబ్ డివిజన్‌లో ప్రజల శాంతిభద్రతల పరిరక్షణతో పాటు, ప్రజలకు మెరుగైన రీతిలో సేవలు అందించేందుకు చర్యలు చేపట్టాలని ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిషోర్ చెప్పారు. పోలవరం సబ్ డివిజన్ పోలీస్ అధికారిగా ఎం.వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. ఆయన బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఏలూరులోని పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసి పూలకుండీని అందజేశారు. ఏలూరు ఇంటిలిజెన్స్ డీఎస్పీగా పనిచేసిన వెంకటేశ్వరరావు సాధారణ బదిలీల్లో భాగంగా పోలవరం డీఎస్పీగా బదిలీపై వచ్చారు.